ప్రక్కనవున్న భూమిని సాగుచేసుకుంటున్నారు, గాజుల్లంక రైతులు. తన తెలివి తేటల వల్ల, పట్టుదలవల్ల ఆయా భూములు తనకేనని దస్తావేజులు పుట్టించుకోగలిగాడు గదా! ఇకనైనా ఆ భూములనుండి తొలగకూడదు రైతులు. వాళ్లు ఎంత పేదవారైతే మాత్రం-దస్తావేజులు జమీందారువని రుజువు చేస్తున్నపుడు భూములు వదిలి పోవలసిందే కదూ! అలా చేయక న్యాయశాస్త్ర విరుద్ధమైన పనికి పూనుకుంటే వారి పైన తుపాకులను సైతం కాల్చి న్యాయాన్ని నిలబెట్టేందుకు కాంగ్రెసు ప్రభుత్వం పట్టు బట్టింది. ఇలాంటి సంఘటనలు మీకెన్నో తెలుసు. దాన్ని ఆసరా చూచుకొనే కమ్యూనిస్టులు ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం చేస్తుంటే అందరినీ జైళ్లలో వేశాం. చెఱుకు తోటల్లో, పొగ తోటల్లో వున్న దుష్టశక్తులను నిలువునా కాల్చిచంపాం! కొన్ని కొన్ని గ్రామాలలో దౌర్జన్యవాదులెవరో చెప్పకపోతే వరుసబెట్టి లాఠీఛార్జి చేశాం. కొటూరు, ఎలమర్రులలో ప్రజల తిక్క అణిగేందుకు వివస్త్రలను చేసి, బుద్ధి వచ్చేందుకు గాంధీగారికి నమస్కారం చేయించాం. పోలీసు బడ్జెటు మొన్ననే గదా మనం చదివింది. మీకు తెలియదు ఆ విషయం? మనదేశంలో ఏమూలకన్నా పోయి చూడండి మనకు మన రాజ్యాన్ని ఏలుకుంటున్నామని తెలుస్తుంది. కోర్టులు, కవర్లు, కాగితాలపై మన దేశంవారి ముద్రలు వేయబడివున్నాయి. కట్టెల కరువు తీరేందుకు గాను, అనుకోకుండా ఎవరన్నా చనిపోతే కట్టెలకన్నా పనికొస్తాయని యీమధ్య ఎక్కడ చూచినా చెట్లను నాటాం.

సోదర సోదరీమణులాలా! ప్రభుత్వం సాధించిన ఘనకార్యాలను గుర్తెగమని శ్రీ రాజుగారు వ్రాశారు. ఆ ఘనకార్యాలను విపులంగా మీకు వివరిద్దామని ప్రయత్నించాను. స్థలాభావంచేత ఈసారికి యింతటితో ముగిస్తున్నాను. కాంగ్రెసును ఎందుకు బలపరచాలో, కాంగ్రెసు గతాన్ని చూచి మరీ ఆలోచించుకోవాలని నా ప్రార్థన.

"తెలుగు స్వతంత్ర" పత్రికాధిపతులు కూడా, రాజుగారు అన్నట్లు గాక, అటు కర్ర విరగకుండా, యిటు పాము చావకుండా వుండే విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇకమీదటనైనా సమంజసమైన, సార్థజనీనమైన విధానాన్ని అమలు జరుపగలుగుతారని నా విశ్వాసం.

కథానిక

# అభిమానం లేని తమ్ముడు

అపసరాల రామకృష్ణారావు

"పోనిద్దురూ! రోజురోజుకీ మరీ చిన్న పిల్లలైపోతున్నారూ?"

అమ్మ మడిగట్టుకుని కూర్చుని ఒత్తుతున్న అప్పడాల ఉండల్లోంచి ఒకటి తీసుకొని నాన్న నోట్లో వేసుకున్నందుకు అమ్మ యీమాట అంట.

అమ్మ మాటల ఘాటుకో, అప్పడాలపిండి ఘాటుకో నాన్న నోటంట మాత్రం మాట రాలేదు.

"అయిందేదో అయింది. పోనీ రుచి యెలా వుందో చెప్పనన్నా చెప్పండి. వ్రతం చెడ్డా ఫలం దక్కుతుందేమో! ఉప్పూ కారం సరిపోయిందా?" అమ్మ అడిగింది.

జవాబుగా నీళ్లు తిరిగిన కళ్ళతో నాన్న మంచినీళ్ళడిగారు.

"అయినా అంత కారం వేసుకుంటారుటమ్మా సుబ్బమ్మా?" అమ్మ వంటమనిషిమీద ఎగిరింది. ఊరుకునే గుణం సుబ్బమ్మలో ఊసుకైనా లేదు.

"ఎండిపోతే తగ్గదుటమ్మా?"

"చాల్లేవమ్మా చేసింది చేసి ఇంకా మాట్లాడతావ్? ఎండుతే ఉప్పూ కారం హెచ్చుతాయి గాని తగ్గుతాయుటమ్మా? ఛీ! ఏదైనా తల చెడితే యిలాగే తగులడుతుంది. నా మడి ఎలావుందో ఈ అప్పడాలూ అలాగేవున్నాయి,

అన్నపూర్ణా! అన్నపూర్ణా!... ఏమండీ, కాస్త దాన్ని యిలా పిల్చి పెడుదురూ!"

నాన్న పిల్చేరు కాబోలు. కాస్సేపటికి అన్నపూర్ణ పాపాయి నెత్తుకు వొచ్చింది.

"ఏమే అమ్మా!"

"చూడు తల్లీ, ఆ పాపాయిని కాస్సేపు తమ్ముడికిచ్చి, కొట్టుగదిలో చిక్కాల బీరువాలో పరిపిండి వుంటుంది, తలకొట్టి ఓ పావు సేరు కొలిచి యిలా పట్రద్దూ!"

అన్నపూర్ణ అలాగే చేసింది. తమ్ముడి చేతుల్లోంచి పాపాయిని తీసుకొని తిరిగి వెళ్లిపోతోంది.

"ఎక్కడికే?"

"ఎక్కడికేమిటమ్మా?- మొగాడు వాడికేమిటిగాని- వాణ్ణి చూడాలని నా ప్రాణం ఎంత కొట్టుకుపోతూందో... అలా పందిరిపట్టు మంచంమీద కూర్చుని నేనూ తమ్ముడూ... కిటికీలోంచి వొచ్చే రైలూ పోయే రైలూ చూస్తూనే వున్నాం. వాడి మొహంకోసం వెర్రి మొహాలు వేసుకొని నిర్మోహమాటంగా ఎందరి మొహాలు చూస్తున్నామో! అయినా యిదేం విచిత్రమమ్మా ఎక్కడా చూళ్ళేదు! అంతదూరం నించి వొస్తున్న వాడు తిన్నగా ఇక్కడ దిగక వాళ్లింట్లోకూ చోడమేమిటీ? ఛీ?"

జవాబుకోసం అమ్మ ముఖంలోకి చూసింది అన్నపూర్ణ.

అమ్మ మాట్లాడలేదు.

"నువ్వు వాడికేం అనమని నా ఉద్దేశం కాదమ్మోయ్— నువ్వేం చెడ్డపేరు పడనక్కర్లేదు. అది నామీదే.ఉండనీ. నీ అభిమానానికి అంతూ పొంతూ ఉన్నట్టు నాకేం కనిపించలేదు. 'కొమ్మజేబు తడిమితే అమ్మ కడుపు తడుముతుంది' అంటారు ఇదే కాబోలు."

"నీ పిల్లలు పెద్దవాళ్ళయితే నీకూ అభిమానం అంటే ఏమిటో తెలుస్తుంది. అనువు రావాలిగాని అభిమానం అనురాగం అడడానికి కూడా వుంటాయి తల్లీ!"

నాన్న అమ్మను ఎందుకో పిల్చారు. అమ్మ చేతులు కడుక్కొని వీధిలోకి వెళ్ళింది

"ఏమిటమ్మాయిగారూ సంగతి?" సమయం కనిపెట్టి అడిగింది సుబ్బమ్మ.

"ఏమిటి సుబ్బమ్మగారూ! అన్నీ తెలిసే అడుగుతారు! మా పెద్ద తమ్ముడు రామం సంగతండీ! కాశీలో చదువుకుంటున్నాడు కదూ!"

"అవును. అమ్మగారు చెప్పారు."

"వాడే. మూడేళ్ళయింది నేను చూసి. పెళ్ళికి చూసేనంతే. మళ్లీ వాడి కార్యానికి రావడానికే కుదిరింది కాదు. ఆయనతో మూడు రోజులు హోరాహోరీ పోరాడి, పోనీ వీడు కూడా వస్తాడుకదా నాలుగురోజులు సరదాగా వుందాం అని ఆ ఖర్గపూర్ నించి చచ్చీ చెడీ వొచ్చాను. ఏముందీ? యివాళే ఆయన బయల్దేరి రమ్మన్నారు. యివాళ ప్రయాణం మానేశాను. ఏంచెయ్యను మరీ? వాడికోసం పిచ్చైనా చెయ్యవలసివస్తోంది. రేపైనా బయల్దేరకపోతే ఆయన వూరుకోరు. నేనింత గిలగిలలాడుతూ ఉంటే ఆయనగారు కాశీనుంచి ఏకంగా అత్తారింటికే వేశాడు మకాం. ఇవేళేనా వస్తాడో రాడో!"

సుబ్బమ్మ ఆశ్చర్యంగా వింటోంది అప్పడాల మాటే మరిచి.

"అయినా ఎక్కడా లేని పద్ధతమ్మా! ఎంత కొత్తల్లుడయితే మాత్రం, యెంత అత్తగారిల్లయితే మాత్రం ఇన్నాళ్లుండిపోతాడా? ఛీ. యెవరయినా వింటే నవ్వరూ? దసరా అంతా అయిపోయి నాలుగు రోజులయింది - ఇంకా అక్కడ గుగ్గిళ్లు తింటూ, నలక పేసుకొంటూ, యిక్కడే ఉంటా''నంటూ ఏం చేస్తున్నాడో!"

వస్తూన్న నవ్వును ఆపుకొని-నడవలోంచి వస్తున్న అమ్మని చూసి త్వరత్వరగా అప్పడాలు ఒత్తడం మొదలుపెట్టింది సుబ్బమ్మ.

వస్తూన్న అమ్మమ్మ కొంగుపట్టుకొని పాపాయి ముద్దుముద్దుగా అడిగాడు "అమ్మమ్మా! పెదమామయ్య యెప్పుడొస్తాడు?"

"ఛీ! రోజుకి పదిసార్లు అడుగుతాడు! వీడి పాటి అభిమానం కూడా లేకపోయింది వాడికి" అని పాపాయిని తీసుకుని కరిచినట్టు ముద్దెట్టుకుంది అన్నపూర్ణ.

"ఎందుకలా అనుకుంటావు తల్లీ! బావమరదులు-తోడల్లుళ్లు- సరదాలు-షికార్లు- వీటిలో మునిగిపోయి వుంటాడు. వాడే వస్తాడు"

"రాకపోతే మానేస్తాడు. అంతేనా? నువ్వనవలసిన మాటేనా అమ్మా యిదీ? మన

కంటూ, బావమరుదులు! తోడల్లుళ్లూనా, ముఖ్యం? కొసని వొచ్చిన కొమ్ములువాడి అంటారు దీన్నే! సరేలే, విసిగించి విసిగించి వాడే నా అభిమానాన్ని చంపుకున్నాడు. కొస్త వెళ్ళేముందు రెండు రోజులు వచ్చి నిన్నూ, నాన్ననీ చూస్తే అంతేచాలు."

జవాబుకి యెదురుచూడకుండా పాపాయిని యెత్తుకుని విసురుగా గదిలోకి వెళ్లిపోయింది అన్నపూర్ణ. చిన్న తమ్ముడు అన్నయ్యకోసం యింకా చూస్తూనే ఉన్నాడు. అన్నపూర్ణ వెనకనించే వాడి తలమీద ఒక్క ముద్దెట్టుకుంది. వాడు యిటు తిరిగాడు.

"అన్నయ్య యివాళ మెయిల్లో రానట్టేనే చిన్నక్కా?"

"పోనెద్దూ ఒరే, వాడికోసం ఇంక చూడకు. చూసింది చాలు!" అంటూనే అన్నపూర్ణ తన యింటివైపు వచ్చే బళ్లేమైనా ఉన్నాయేమో అని కిటికీలోంచి చూసింది.

"మనుషులెంతలో మారిపోతారురా తమ్ముడూ. చీరలు తెస్తాననీ, రిబ్బన్లు తెస్తాననీ, పాపాయికి బుష్కోట్లు తెస్తాననీ ఎంతలా అభిమానం ఉట్టిపడుతూ రాశాడో! ఆవిడగార్ని చూడగానే అన్నీ యింకిపోయాయి గాబోలు"

"ఆవిడగారెవరే... ఓహో! వదినా?"

"అవున్రా. సరేకాని తమ్ముడూ! పెళ్ళి చేసుకోగానే నువ్వూ యిలాగే తయారవుతావా?"

"ఛీ!–"సిగ్గుతోనూ అసహ్యంతోనూ చిన్న తమ్ముడి మొహం ఎర్రబడిపోయింది. "అసలు నే పెళ్ళే చేసుకోను!" అన్నాడు మూతిబిగించి.

అన్నపూర్ణ ప్రేమతో వాణ్ణి దగ్గరకు తీసుకుంది.

"వాడికి వాళ్ళే ఎక్కువయినప్పుడు మనమెందుకు ఊరుకోవాలి చిన్నక్కా! నేను అన్నయ్య వస్తే మాట్లాడేనా మాట్లాడను."

ఈ మాటలు విన్నాక అన్నపూర్ణ మనసులో ఏదో ఆలోచన మెరుపులా మెరిసింది.

"నిజమేరా తమ్ముడూ, మాబాగాచెప్పేవు. వాడికి తగ్గట్టు మనం నడుచుకోకపోబట్టే వాడి ఆటలు సాగుతున్నాయి. నేను వెళ్ళేలోగా వాడెలాగా రాడనుకో – వస్తే నేనూ సరిగా మాట్లాడను. అమ్మకిష్టమైతే ఆవిడ వాడిని నెత్తికెక్కించుకోనీ. వాడేదో తప్పుచేసినట్టు వాడికి తెలిసేటట్టు – నువ్వు మాత్రం చాలా ముభావంగా వుండాలి సుమా తమ్ముడూ! నాలుగుసార్లు అడిగితేగాని ఓ మాటకి జవాబు చెప్పకు. ఒకేపాటిగా నువ్వూను, పెదమావయ్య వస్తే పలకకేం! మాట్లాడేవంటే వళ్లు చీరుస్తాను జాగ్రత–ఏం?"

పాపాయి బోధపడక పోయినా తల అడ్డంగా తిప్పేడు.

సుబ్బమ్మ హడావిడిగా అక్కడికి వచ్చింది.

"ఏవమ్మా అన్నపూర్ణమ్మగారూ పలకరు? నాన్నగారు ఊః కోప్పడుతున్నారు. వడ్డించేశాను, మీరూ చిన్నబాబుగారూ రండి భోజనానికి."

సుబ్బమ్మ వెనకాలే వెళ్ళేరు కృతనిశ్చయులైన అక్కా తమ్ముడూను.

* * *

"అమ్మాయిగారూ! అమ్మాయిగారూ! పెదబాబు వచ్చేరు!"

సుబ్బమ్మ మాటలు విని తమ్ముడు అడిగాడు.

"ఇప్పుడేం రైలుందే చిన్నక్కా?"

"రాత్రి ప్యాసింజరు గాబోలా! పడుకో నిద్రపోయినట్టు నటించు. పిలిచినా పలక్కు, ముసుగు తన్నేయ్! ఒరే పాపాయీ, నిన్నే పెదమావయ్య పిలుసే వెళ్ళేవా, జాగ్రత్త!"

పాపాయికి ముసుగు కప్పి తనుకూడా పూర్తిగా ముసుగు తన్నేసింది అన్నపూర్ణ.

మల్లె పందిరికింద పక్కపక్కని మంచాలు వేసుకొని అక్కా తమ్ముళ్ళిద్దరూ, కాలువల లోంచి చందమామను చూస్తూ పది నిమిషాలు దొంగనిద్రపోవడం బ్రహ్మాండమైంది.

"అబ్బా! యింకా అన్నయ్య లోపలికి రాడేమే చిన్నక్కా?"

"నాన్నతో మాట్లాడుతున్నాడేమో. అయినా ఇంతసేపు మాటలేమిటీ? ఉండుండు. ఎవరో వస్తున్నారు. పడుకో."

తమ్ముడు ముసుగు తన్నేశాడు మళ్ళీ.

"వదినె పడుకున్నారేమిటి?"

"వచ్చిందీ వయ్యారిభామా?" అనుకొంది గొంతుక పోల్చి అన్నపూర్ణ.

"పడుకోవడ మేమిటి? అది తొమ్మిదేస్తే గాని పడుకోదు. ఇలా రా!"

ఈ అమ్మ మరీను— తన దగ్గిరకు వచ్చేసి ముసుగు తీసేసి తడుతూ "అన్నపూర్ణా!... ఇదుగో సరళా వాళ్ళూ వచ్చారు. అప్పుడే నిద్రేమిటి? లే!" అంటూ పట్టింది. అన్నపూర్ణ శాలువ మాత్రం తీసింది. మంచంమీంచి మాత్రం లేవలేదు.

దగ్గరకి వచ్చి కూర్చుంది సరళ.

"ఏం వదినా, పాపాయి ఏడీ?"

"పడుకున్నాడు."

"లేదు—లేదు."

వెధవ! వెధవన్నర వెధవాని! ఇన్నీ చెబితే అంతలో లేచి పోవాలీ?

సరళ వాడినెత్తుకు ముద్దెట్టుకుంది. చేతిలో వున్న పిప్పరమెంటు బిళ్ళల పొట్లం వాడి చేతులో పెట్టింది.

"వాడేడీ? అసలు వచ్చాడా రాలేదా?" అని అడుగుదామని అన్నపూర్ణకి నోటి కొస దాకా వచ్చింది.

తన నిశ్చయం జ్ఞాపకం వచ్చి అతికష్టపడి ఆపుకుంది. వదిన, అట్టే మాట్లాడకపోగా పక్కమీంచేనా లేవకపోవడం చూసి, పాపాయిని ఒళ్ళోంచి దింపి "వస్తాను" అని సరళ వెళ్ళిపోయింది. పావుగంట గడిచింది. "పెత్తమ్ముడు వచ్చివుండడు అనుకొంది అన్నపూర్ణ."

"పాపాయీ! పెదమావయ్య వచ్చాడో లేదో చూసిరా అమ్మా."

విడుదలయిన ఖైదీలా పాపాయి మంచం మీంచి ఒక్క గంతువేసి పరుగెత్తాడు. అయిదు నిమిషాలలో వచ్చి "అమ్మా! వచ్చాడే! వీధి గదిలో పడుకున్నాడే!" అన్నాడు.

అదేమిటి? రాగానే తన్నయినా చూడకుండా యీ పడకేమిటి? ఒక్కసారి తమ్ముడిని కన్నారా చూసి నోరారా పలకరిద్దామనుకుంది అన్నపూర్ణ. కాని నిశ్చలంగా నిద్ర నటిస్తున్న తమ్ముణ్ణి చూడగానే అభిప్రాయం మార్చుకుంది.

"భోజనాలు చేసి వచ్చి ఉంటారు. రాగానే పడుకుని ఉంటారు" అనుకుని పాపాయిని పిలిచి "ఒరే, పెద్దత్త ఏంచేస్తూందో చూడు" అంది.

వాడు క్షణంలో వచ్చి— "వంటింట్లో ఒక్కర్తీ భోంచేస్తూందమ్మా!" అన్నాడు.

"ఒక్కర్తీనా? ఏమిటీ దీని అర్థం?" ఆమె అభిమాన హృదయం తెలియకుండా కొట్టుకోసాగింది.

ఇంతలో నాన్నక్కడకొచ్చి "నిద్ర ఏమిటి తల్లీ!" అన్నారు.

అన్నపూర్ణ సద్దుకుంటూ, "చిన్న కును కట్టింది నాన్నా! ఏం?"

"గోపాలం వచ్చాడు. నూట రెండు డిగ్రీల జ్వరంతో వచ్చాడుట; నువ్వు మళ్ళీ వెళ్ళిపోతావేమోనని... నిన్ను పిలుస్తున్నాడు తల్లీ!"

ఇదివరకే కలవరపడుతున్న అన్నపూర్ణ యీ మాటతో ఆగలేకపోయింది.

"నిన్ననే జ్వరం వచ్చి ఇవాళ హెచ్చయి పోయిందిట."

"వస్తున్నాను నాన్నా" అంటూ కన్నీళ్లతో అన్నపూర్ణ లేవబోయినా తన్ని లేవనియ్యకుండా ఏదో అడ్డినట్లయింది. తన మనసు మార్చుకొని లేచిపోకుండా వెర్రి చిన్నతమ్ముడు మంచానికీ తన జడకీ వేసిన ముడి అది! ఆమెకు తనూ తమ్ముడూ అనుకున్న మాటే జ్ఞాపకంలేదు! "నిన్నటినుంచే జ్వరమైతే మొన్నటి వరకూ ఎందుకు రాలేదు?" అని ఆ ఆదరమయికి తోచలేదు. తన నిరీక్షణ మాటగాని దానికి తను కారణం కనుక్కుందామన్న ప్రసక్తిగాని ఆ అనురాగమయికి అనిపించనేలేదు. ఆమెకు "తనకోసం జ్వరంతో తమ్ముడు వచ్చా"డన్న మాట తప్ప మరొకటి తోచనేలేదు. మంచానికీ జడకీ కట్టబడిన హద్దు ముడి పుటుక్కున తెంపేసి చిన్న తమ్ముడి వైపేనా చూడకుండా వీధి గదిలోకి పరుగెత్తింది అన్నపూర్ణ.

అక్క పక్కమీంచి లేచి పోవడం - ఎంతకీ రాకపోవడం చూసి వెంటనే చిన్న తమ్ముడు వీధి గదివైపు వెళ్ళి కిటికీలోంచి చూశాడు.

అన్నయ్య తల ఒళ్ళోపెట్టుకుని చేత్తో విసురుతూ ఒక చేత్తో తల పడుతూ కబుర్లు చెబుతున్న చిన్నక్క యిలా మారడానికి కారణం ఎంత ఆలోచించినా చిన్నతమ్ముడి కుర్ర బుర్రకి తోచనేలేదు.